ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బరువును మించి... బడిసంచి

- కేజీ విద్యకు 5 కేజీల పుస్తకాలు
- విద్యా సంస్థల ఆదాయం కోసం వర్క్ బుక్కులు
- బట్టీ చదువుకు శ్రీకారం చుట్టిన విద్యా సంస్థలు
- మామూళ్లు ఇస్తే మాట్లాడమంటున్న విద్యా శాఖ అధికారులు

తల్లి ఒడిలో ఉంటూ తల్లి చెబుతున్న కబుర్లు వింటూ పెరగాల్సిన చిన్నారులు...పాఠశాలకు వెళ్లి చదువుకుంటు సరదాగా గడపాల్సిన బాల్యం నేడు ప్రయివేటు...కార్పొరేట్ విద్యా సంస్థల్లో బందీ అవుతోంది. కేజీ విద్యకు 5 కేజీల బరువును మోస్తూ తెల్లారిన వెంటనే పాఠశాలలకు పరుగులు పెడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉదయం ఎనిమిది అయిందంటే.. విద్యార్థులు బడి సంచులు భుజాన వేసుకుని భారంగా నడవడం చూస్తుంటాం. మెడ వంగిపోతుందా.. అనేంత బరువుంటుందా సంచి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే బ్యాగు మోత తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. శక్తికి మించి బరువుండే పుస్తకాల సంచిని మెడలో వేసుకొని వెళ్లడానికి పిల్లలు నానా అవస్థలు పడుతుంటారు. పిల్లల శరీర బరువులో బ్యాగు బరువు 10 శాతం మించొద్దనే విషయమై విద్యావేత్తలు అనేక సార్లు సూచించినా.. ప్రభుత్వాలు నియమించిన విద్యా కమిటీలు ఆ మేరకు ప్రతిపాదనలు

చేసినా.. అమలు కొరవడింది. దీనిపై నిర్దిష్ట ప్రయత్నాలు జరగడంలేదని విద్యానిపుణులు, పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం సాధారణంగా 8 నుంచి 10 తరగతి చదివే ఆరోగ్యకరమైన చిన్నారి బరువు 25 నుంచి 35 కేజీలు ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 10 నుంచి 15 కేజీల బరువున్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ వెళుతున్నారు. నిబంధనల ప్రకారం 1 తరగతి విద్యార్థి 750 గ్రాములు, 2వ తరగతి 2 కేజీలు, 3, 4 తరగతుల పిల్లలు 3 కేజీలు, 5వ తరగతి 4 కేజీలు, 6 తరగతి 6 కేజీలు, 7వ తరగతి 8 కేజీలు, 8వ తరగతి 10 కేజీలు, 9, 10 తరగతుల పిల్లలు 12 కేజీలు మాత్రమే బరువు మోయాల్సుంది. ఈ నిబంధనలకు భిన్నంగా రెట్టింపు బరువు కన్న ఎక్కువ మోస్తున్నారు. దీంతో వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా స్కూల్ బ్యాగులను మోస్తున్న విద్యార్థులు చిన్న వయసులోనే నడుము, మోకాళ్ల నొప్పులు, ఇతరత్రా అర్థో సమస్యలతో బాధ పడుతున్నట్లు తల్లి దండ్రులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్కూలు బ్యాగుల బరువును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ వీటిని అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రయివేటు పాఠశాలల్లో ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 800 పైగా ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు రెండు లక్షల మంది పైగా విద్యార్థులు చదువుతున్నారు. బరువులు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని యూనిసెఫ్‌తో బాటు వివిధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే పుస్తకాల బరువు అధికంగా ఉంటుంది. క్లాస్, ఫెయిర్ వర్క్ కోసం ప్రత్యేకంగా వేరువేరు నోట్ బుక్కులు ప్రతిరోజూ తెప్పిస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేని పుస్తకాలు, నోట్‌బుక్కులను భద్ర పర్చుకునేందుకు తరగతి గదుల్లో అల్మారాలు, ర్యాక్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలలోనూ ఈ ఏర్పాట్లు లేవు. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటంతో మోత బరువుతో మెట్లు ఎక్కుతున్న విద్యార్థులు వెన్ను, మోకాళ్ల నొప్పులతో సతమతమవుతున్నారు. శక్తికి మించి బరువు మోయడంతో వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది.

విద్యాహక్కు చట్టానికి తూట్లు...

విద్యా హక్కు చట్టాన్ని పక్కన పెట్టి జిల్లాలో పలు ప్రయివేటు విద్యా సంస్థలు నిబంధనలను విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. భారీగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులు కొల్లగొడుతున్నాయి. అదే సందర్భంలో పుస్తకాలను వారి వద్దే కొనుగోలు చేయాలని తేల్చి భారీగా ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. యథేచ్ఛగా అమ్మకాలు జరపడమే కాక నోటుబుక్కులు, షూస్, టై, యూనిఫామ్ ఇలా విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వస్తువులూ అక్కడే కొనుగోలు చేయాలని స్పష్టం చేస్తున్నాయి. బయట కొనుగోలు చేసేవి ఇక్కడ చెల్లుబాటు కావని హెచ్చరిస్తున్నారు.

అధిక ధరలకు విక్రయాలు

ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వారికి ఉచితంగా, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలకు తరగతుల వారీగా ప్రభుత్వం పుస్తకాల ధరలను నిర్ణయించింది. 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంకు రూ.326 నుంచి రూ.657 వరకూ, ఇంగ్లీషు మీడియంకు రూ.280 నుంచి రూ.674 వరకూ మాత్రమే పాఠ్యపుస్తకాలను విక్రయించాల్సి ఉంది. నిర్ణయించిన ధరలకు మించి ఎక్కవ రేట్లకు అమ్మితే సంబందిత ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఫీజులు, డొనేషన్ల పేరుతో భారీగా సొమ్ములు దండుతున్నారు. బస్సు రవాణా ఛార్జీలను విడిగా వసూలు చేస్తున్నారు. అవే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు 10 నుంచి 20 శాతం అదనంగా పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు.

అవసరం లేకున్నా వర్కు పుస్తకాలు

ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు...నోటు పుస్తకాలతో పాటు అవసరం లేకున్న వారి ఆదాయం కోసం వర్కు బుక్కులను అంటగడుతున్నారు. దీంతో ఆటపాటలతో గడపాల్సిన బాల్యం నాలుగు గోడల మధ్య పుస్తకాల బందీఖానా అవుతోంది. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకోనే వరకు ఉద్యమిస్తాం

విద్యను వ్యాపారం చేసి విద్యార్థులను పుస్తకాల పురుగులను చేసి వారి మరణాలకు కారణమవుతున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడిస్తాం. నిబందనలు పాటించని, ఫీజుల పేరుతో, పుస్తకాల నుంచి యూనిఫాం పేరుతో దోపిడీకి పాల్పడితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అట్టి విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తాం. దీనికి పూర్తి బాధ్యత విద్యాశాఖ అధికారులదే.

నాగార్జున,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

సగం ధరకేనా..?

ఇలా అయితే భూమి ఇవ్వడం కుదరదంటున్న రైతులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

గత నాలుగేళ్ల క్రితం మండలంలోని టెకులోడు గ్రామంలో భూ సేకరణ అనిఅప్పటి కలెక్టర్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. రైతులు, అధికారుల మధ్య జరిగిన చర్చల అనంతరం అందరూ ఎకరా రూ. 25 లక్షలకు ప్రదిపాదనలు చేసి అంగీకారం చేసుకున్నారు. ఆ తర్వత కాలంలో అక్కడే జగనన్న కాలనీ కోసం దాదాపు అదే ధరకు భూమిని ప్రభుత్వం సేకరించింది. తర్వత కాలంలో భూ సేకరణ జరగలేదు. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా టేకులోడు ప్రాంతంలో భూ సేకరణ చేసేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. నాలుగేళ్ల క్రితమే రూ. 25 లక్షలకు ఒప్పుకున్న అదికారులు ఇప్పుడు కనీసం రూ. 30 లక్షలు అయిన నిర్ధారణ చేస్తారని రైతులు భావించారు. అయితే గురువారం టేకులోడు లో నిర్వహించిన గ్రామ సభలో ప్రభుత్వం వైపు నుండి రూ. 12 లక్షలు ప్రతిపాదిస్తున్నట్లు అదికారులు చెప్పడంతో రైతులు ఒక్కసారిగా కంగుతిన్నారు. గతంలో నిర్ధారించిన ధరలో సగానికి తగ్గించి ప్రతిపాదన చేయడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధరకు అయితే తాము భూములు ఇవ్వడం కుదరదని చెప్పారు. ఏది ఏమైనా అదికారుల రూ. 12 లక్షల ప్రతిపాదన పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ప్రతిపాదించిన ధరకే కొనుగోలు చేసేందుకు సుముఖత చూపితే రైతులు మరింత డిమాండ్ చేస్తారన్న ఆలోచనతో తక్కువ ప్రతిపాదన చేశారేమే అంటు కొందరు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నటరాజ్, ఎమ్మెల్యే పీఏ సురేంద్ర బాబు, శ్రీనివాసులు, కో-ఆర్డీనేటర్ రంగారెడ్డి, కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అనుమతి లేకుండా భూసేకరణ వద్దు: సిపిఎం వినతిపత్రం

చిలమత్తూరు మండలంలో గత 2007 నుండి రైతుల నుంచి ప్రభుత్వం భూములు సేకరిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క పరిశ్రమ కూడా స్థాపించకపోవడం దురదృష్టకరమని సిపిఎం నాయకులు అన్నారు. టేకులోడు ప్రాంతంలో 2016 నుండి భూములు తీసుకున్నా, అభివృద్ధి పనులు ప్రారంభించలేదన్నారు. తాజాగా రైతుల అనుమతి లేకుండా భూములు సేకరించేందుకు ప్రయత్నిస్తుండటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతుల భూములు తప్పనిసరిగా వారి అంగీకారంతోనే తీసుకోవాలని, ఇప్పటికే సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ప్రతి రైతు కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, ఫిరంగి ప్రవీణ్ కుమార్, రామచంద్ర, నాగరాజు, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

మందులు వాడితే క్షయను నివారించొచ్చు

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని క్షయ వ్యాధి గ్రస్తులతో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా క్షయ వ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టిక ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1172 మంది టీబీ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని అన్నారు. వారికి జిల్లాలో గల రెండు సంస్థల సహకారంతో పౌష్టికాహారం ఆరు నెలల చొప్పున అందిస్తున్నామన్నారు. ప్రతి వ్యాధిగ్రస్తుడు పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా మందులు కూడా తీసుకోవాలని అలాగే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. మొదటగా కలెక్టర్ క్షయ వ్యాధి రోగులకు 1 కేజీ కంది బేడలు, 1 కేజీ రాగి పిండి, 1 కేజీ గోధుమపిండి, 1 కేజీ శెనగపిండి, 1 కేజీ వేరుశెనగ నూనె, 30 కోడిగుడ్లు, 250 గ్రాముల చిక్కి బర్ఫీలు, 1 కేజీ శనగలు, 8 రకాల పౌష్టికాహార పదార్థాల కిట్టును క్షయ వ్యాధి గ్రస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్స్ సింగ్వా కంపెనీ ప్రతినిధులు శ్రీరాములు, ఏజీ అండ్ పి కంపెనీ ఆదిత్య, డిఎస్ఒ వంశీకృష్ణ, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మధుసూదన్, డిఎల్ఎటిఒ డాక్టర్ ఎస్ఎ. సునీల్ కుమార్, ఎంఒడిటిసి డాక్టర్ గాయత్రి, టీబీ యూనిట్ సిబ్బంది, టిబి వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందజేస్తున్న కలెక్టర్

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

10వ రోజుకు చేరిన నిరాహార దీక్షలు

దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కన్వీనర్ రాము

ప్రజాశక్తి హిందూపురం

పురపాలక సంఘంలో పొరుగు సేవల కింద పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రాము డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ పారిశుధ్యకార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా హిందూపురం సిఐటియు పట్టణ కార్యదర్శి రాము కార్మికులకు మద్దతుగా మాట్లాడుతూ కార్మికులు నిరసనకు దిగి 10 రోజులు గడిచినప్పటికీ పాలకపక్షం, మున్సిపల్ అధికారులు స్పందించకపోవటం దారుణమన్నారు. కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నారని విమర్శించారు. 25 సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేసిన తర్వాత వయసు మళ్లిందని తమకు ఎటువంటి సంబంధం లేదనే పద్ధతుల్లో అధికారులు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులను అప్పుడప్పుడు సన్మానాల పేరుతో పొగిడేసి కార్మికుల పైన ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, సహాయ కార్యదర్శి రామచంద్ర, నాయకులు చంద్ర, బాబయ్య, శంకర, మూర్తి, మహిళ నాయకులు గంగ రత్నమ్మ, కవిత, సుబ్బలమ్మ, నాగమణి, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ రబ్బర్ పరిశ్రమ కార్మికుల సమ్మె నోటీస్

ప్రజాశక్తి-పెనుకొండ

ఈ నెల 9వ తేదీ దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో స్వచ్ఛంధంగా పరిశ్రమను బంద్ చేసి సహకరించాలని ఈశ్వర్ రబ్బర్ పరిశ్రమ మేనేజర్ రాజామణికి గురువారం ప్రజాసంఘాలు సమ్మె నోటీసు ఇచ్చారు. సిఐటియు, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక, కర్షక చట్టాలు, హక్కుల రక్షణతో పాటు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు కార్మికులు సమ్మెలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమ లు చేస్తున్న లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చేం దుకు కార్మిక, కర్షక, రైతులు పోరాటం చేయాల న్నారు. ఉపాధి హామీ పని దినాలు ఏడాదికి 200 రోజులు కల్పించాలని, రోజు కూలి రూ. 600 ఇవ్వా లని, తదితర అంశాల సాధన కోసం దేశావ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కోకన్వీనర్ నాగభూషణ, కెవిపి ఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బెస్త క్రిష్టప్ప, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు కుమ్మర కిష్టప్ప, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వర్ రబ్బర్ పరిశ్రమ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జాతీయ స్థాయి సదస్సుకు 'పురం' మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

హర్యానా రాష్ట్రం గురుగావ్‌లో గురువారం జరిగిన జాతీయస్థాయి కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల సదస్సులో హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్ పాల్గొన్నారు. రెండు రోజులు పాటు జరిగే సదస్సును లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా ముఖ్యమంత్రి పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల పాత్ర, స్థానిక సంస్థలు బలోపేతానికి ప్రజాప్రతినిధులు అవలంబించాల్సిన విధివిధానాలపై తీసుకోవాల్సిన చర్యలపై సదస్సులో వివరించడం జరుగుతుందని తెలిపారు. అనుభవజ్ఞులైన మేధావులచే వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా స్థానిక సంస్థల ఆదాయ మార్గాలను ఏ విధంగా పెంపొందించుకోవాలి, ప్రజలకు మెరుగైన సేవలను ఎలా అందించాలి అన్న అంశాలపై అవగతం అవుతుందని ఆయన తెలిపారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

జామియా ఆస్తులను స్వాధీనం చేసుకున్న వక్ఫ్ బోర్డు అధికారులు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలోని జామియా ఆస్తులను వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకున్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు రహీం, ఇస్మాయిల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు అధికారులు హిందూపురం పట్టణాన్ని సందర్శించి జామియా మసీదు ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న జామియా కమిటీను పదవీకాలం ముగిసినందున ఐదుగురు మత పెద్దలను ఇన్చార్జులుగా నియమించినట్లు వివరించారు. ఆస్తుల వివరాలు అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల గురించి ప్రస్తుతం ఉన్న కమిటీ పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. నూతనంగా లోకల్ బాడీ ఎలక్షన్ల జీవో నెంబర్ 17 ఆధారంగా త్వరలో జామియా మసీదు కమిటీ ఎన్నికలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు కమిటీ, ముత్తు వల్లి, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

15న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ నెల 15వ తేదీ గోరంట్ల మండలంలో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కోశాధికారి అంకె.ముత్యాలు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కొత్తచెరువులో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ముత్యాలు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వలసలను నివారించాలని, సామాన్యుడు ఇల్లు కట్టుకునేలా ముడుసరుకుల ధరలు తగ్గించాలని, తదితర డిమాండ్లపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తామన్నారు. కావున మండలంలోని అన్ని నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, కె.శ్రావణి, షేక్ షబానా, ఎ.నాగరాజు, గోపాల్, మెహబూబ్, షేక్ అజీమ్, సాయి, రాజేష్, బి.లక్ష్మన్న పాల్గొన్నారు.

పట్టు చీరల వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో పట్టు చీరల వ్యాపారి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శాంతినగర్‌లో నివాసముండే జగదీష్ అనే పట్టుచీరల వ్యాపారి తన ఇంట్లో పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నారు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. జగదీష్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ మండలంలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ముదిగుబ్బలోని కదిరి రోడ్డు పక్కన పొలాల్లో దాదాపు మూడు రోజుల క్రితం జరిగిన ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు నల్లచెరువు మండలంలోని టి. ఎర్రగుంటిపల్లికి చెందిన విశ్వనాథ్ ఓబుళదేవరచెరువు మండలంలో వివాహం చేసుకున్నాడు. ముదిగుబ్బ మండలంలోని బైపాస్ దగ్గర అటవీ ప్రాంతంలో విశ్వనాథ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. తల, మొండెం వేరు చేశారు. సమాచారం అందుకున్న ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, ముదిగుబ్బ టౌన్ సిఐ శివరాముడు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : మంత్రి

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సిఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం మంత్రి సవిత సోమందేపల్లిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయా లేకపోతే అవి రాకపోవడానికి కారాణాలు తెలుసు కుని వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మీడియా తో మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉండగా ప్రజలను గాలికి వదిలేశారు, గాల్లోనే తిరిగారు, ఇప్పుడు మేనిఫెస్టో రీకాలింగ్ పేరునా వారి ఉనికి చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. శవ రాజకీయాలు చేయడం జగన్‌కు పరిపాటే అన్నారు. జగన్ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఏడాదిలోనే గాడిన పెట్టామన్నారు. అనంతరం స్థానిక చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో పట్టణ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త ఈ నెల రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివద్ధిని, భవిష్యత్తులో ఏమి చేయబోతున్నామో ప్రజలకు వివరించాలన్నారు. పజల సమస్యలపై దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ వెంకటేష్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, నాయకులు వెంకట రమణ, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, నీరుగంటి చంద్ర, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సిసి.హరి, సిద్ధలింగప్ప, కిష్టప్ప, బాబయ్య, అశ్వర్థ, డీలర్ మురళి, పెద్ద కోడిపల్లి నరసింహులు, శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్, బిజెపి నాయకుడు సోము, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న మంత్రి సవిత, టిడిపి నాయకులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని పి.నరసాపురం పంచాయతీలో గురువారం కెనరా బ్యాంకు తరపున జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అలాగే సామాజిక భద్రత పథకాలు, సిఎంఎస్‌వై, పిఎంజెజెబివై, పిఎంఎపివై పథకాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొల్లయ్య, రమేష్, నాయకులు గోవిందరెడ్డి, తిరుమలేష్, పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎపిఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యలపై శుక్రవారం కదిరి డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూని యన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని డిపో ప్రచార కార్యదర్శి హరి కుమార్ ఓ ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు, కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఈయూ రాష్ట్ర కార్యదర్శి సి.నబి రసూల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జివైపి.రావు, కె.శ్రీనివాసులు, తదితరులు హాజరవుతారన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని తుమ్మలకుంట్లపల్లి సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో శివరామ ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి సందర్శించి పలు రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని, పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, మర్యాదగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వారి వెంట సచివాలయ సిబ్బంది, వియో, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పాలనలో మహిళలు ముందుండాలి : ఎంపీడీవో

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళా సాధికారత సాధించి, పరిపాలనలో మహిళలు ముందుండాలని ఎంపీడీవో నరేష్‌కృష్ణ సూచించారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం 'మహిళా సాధికారత సాధించడం, స్థానిక స్వపరిపాలన ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించడం' అంశంపై 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెనుకొండ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో పంచాయతీల్లో ఎన్నికైన మహిళా సర్పంచులు పాల్గొనగా మజీద్, త్రివేణి, సోనియా శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ పురుషాధిక్య సమాజంలో మహిళా సాధికారత సాధించి తద్వారా పరిపాలనలో మహిళా సర్పంచులు చురుగ్గా పాల్గొనడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించడం సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కమలాబాయి, మహిళా సర్పంచులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-నల్లమాడ

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలో గురువారం కిశోర్ బాలికలకు బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాత్సల్య పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిసిపియు అధికారి మేఘన హాజరై ఆయా అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో నల్లమాడ ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతి, హెల్త్ డిపార్ట్మెంట్ పిహెచ్ఈఓ రామచంద్ర, అంగన్వాడీ కార్యకర్తలు రామాంజలమ్మ, గంగాదేవి, ఆశా వర్కర్లు, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

బాల సదనంలో వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సాయినగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న బాల సదనంలో గురువారం జిల్లా త్వరిత చికిత్స కేంద్రం డాక్టర్ ప్రేమ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత వైద్య పరీక్షలు నిర్వహించారు. 22 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి జబ్బులను గుర్తించి మందులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, బాలసదనం వార్డెన్ రహమత్‌బి, ఎంవో అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ అనిత, మోహన్‌రెడ్డి, ఆశా వర్కర్ సరస్వతీ పాల్గొన్నారు.

వ్యాధులపై సూచనలు చేస్తున్న వైద్యులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : కందికుంట

ప్రజాశక్తి-తనకల్లు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని మలిరెడ్డిపల్లి పంచాయతీ పెద్దపల్లిలో పర్యటించారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులనున ప్రజలకు వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగానే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేస్తుందని, ఆగష్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఈ ఏడాదిలోనే నిరుద్యోగ భృతి ఇస్తుందని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ ఏడాదిలో ఏం చేసింది.. భవిష్యత్తులో ఏం చేసేది ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట టిడిపి జిల్లా అధ్యక్షుడు కె.అంజనప్ప, ఎస్ఐ గోపి, మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ బోర్డు మెంబర్ డాక్టర్ ముక్తియార్, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు భూక్యలక్ష్మి, శంకర్ నాయుడు, రాజారెడ్డి, కావడి ప్రవీణ్‌కుమార్, నాగభూషణ, బాషా, హరి, అధికారులు ఉన్నారు.

గ్రామస్తులతో ఎమ్మెల్యే కందికుంట

చంద్రబాబుతోనే సుపరిపాలన : ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తితో కలిసి రొళ్ల మండలంలోని హొట్టేబెట్ట, కల్లురొప్పం, గుడ్డుగురికి, వన్నప్ప పాళ్యం, జిఎన్.పాళ్యం గ్రామాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను అందించి, వాటి గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉత్తమ పరిపాలన అందిస్తోందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. వారి వెంట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్.గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, ప్రధాన కార్యదర్శి ఉగ్ర గౌడ్, నాయకులు పాండురంగప్ప, దాసిరెడ్డి, మారుతి ప్రసాద్, భరత్, బాలకృష్ణ, రవికుమార్, వెంకటేష్, హేమంత్ కుమార్, రామకృష్ణ, నాగరాజు, కృష్ణమూర్తి ఉన్నారు.

ఇంటింటికీ సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 9వ తేదీ సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు జెవి.రమణ, ఎస్‌హెచ్.బాషా, టి.అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, డి.చంద్రకళ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురవారం పట్టణంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం, సంక్షేమ పథకాలు, సమాన పనికి సమాన వేతనం, కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ చేయాలని, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, బ్యాంకింగ్, విశాఖ ఉక్కు, ఆర్టీసీ, తదితర ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుపరం చేయవద్దని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.హైదర్‌వలి, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్‌ను విడుదలచేస్తున్న సిఐటియు నాయకులు

బకాయి బిల్లులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులకు బకాయి ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని యూటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు వారు గురువారం స్థానిక రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంబంధిత సంఘం నాయకులు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలకు మూడు నెలలు, ప్రాథమిక పాఠశాలలకు ఆరు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు. నిర్వాహకులు అప్పులు చేసి మరీ పాఠశాలల్లో విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లించాల్సిన బిల్లులు మాత్రం చాలా ఆలస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణ బకాయి బిల్లులను చెల్లించాలని ఏపీ మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెల్పర్ అసోసియేషన్ యూటియూసీ అనుబంధ సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో యూటియూసి రాష్ట్ర నాయకులు ఏ.శ్రీనివాసులు, కే.రంగమ్మ, కే.తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పెనుకొండ : డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ గోపీనాయక్ సూచించారు. పట్టణంలోని గిరిజన, బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జాతీయ డెంగీ మాసోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు మలేరియా, డెంగీ, డయేరియా, తదితర సీజనల్ వ్యాధుల లక్షణాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్ రెడ్డి, ఎఎన్ఎం గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ర్యాలీ చేపట్టిన విద్యార్థినులు

మంత్రి చొరవతో కల్వర్టు మరమ్మతులు

రొద్దం : మండలంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఎల్‌జిబి నగర్ నుంచి బొక్సంపల్లి వెళ్లే దారిలో ఆ గ్రామ సమీపంలో మూడేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కల్వర్టు కింద ఉన్న దిమ్మెలు సగ భాగం పాడై కూలిపోయి పరిస్థితికి చేరింది. ఈ మార్గంలో పొలాలతో పాటు రొద్దం, ఎల్‌జిబి నగర్‌కు రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు ఈ విషయాన్ని టిడిపి సీనియర్ నాయకులు మాధవనాయుడుకు వివరించారు. సమస్యను ఆయన మంత్రి సవితకు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మరమ్మతులు చేయించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో సుమారు మూడేళ్ల సమస్యకు పరిష్కారం లభించింది. కల్వర్టు దిమ్మెలకు మరమ్మతులు చేపట్టారు.

నాడు

నేడు

చిత్రావతి నదిలో కలుస్తున్న కాంక్రీట్ వ్యర్థాలు

కాంక్రీట్ వ్యర్థాలతో తాగునీరు కలుషితం

ప్రజాశక్తి-తాడిమర్రి

కాంక్రీట్ వ్యర్థాలతో మండలంలోని దాడితోట, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామ సరిహద్దుల్లో తాగునీరు కలుషితం అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు గ్రామాలకు సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో అదానీ కంపెనీ నిర్మిస్తున్న అదానీ హైడల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో వినియోగిస్తున్న కాంక్రీట్ వ్యర్థాలను చిత్రావతి రిజర్వాయర్‌లోకి వదులుతున్నారు. తద్వారా తాగు, సాగునీరు కలుషితం అవుతోంది. కావున జిల్లా అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని, కంపెనీ యాజమాన్యం ఆగడాలను అరికట్టాలని పెద్దకోట్ల గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అహుడా చైర్మన్ వరుణ్‌తో జనసేన నాయకులు

అహుడా ఛైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

పరిగి : అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) ఛైర్మన్ టిసి.వరుణ్‌ను గురువారం మండల జనసేన నాయకులు అనంతపురంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయాలని, త్వరలోనే సమావేశం నిర్వహించి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వరుణ్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన బలపడితేనే మరిన్ని ఫలితాలు పొందగల అవకాశం ఉందని, అందరూ ఐకమత్యంతో పని చేయాలని ఆయన సూచించారని జనసేన జిల్లా సెక్రటరీ మోద శివ తెలిపారు. ఆయనతోపాటు నారాయణస్వామి, తదితరులు ఉన్నారు.

బదిలీ హెచ్ఎం గోపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బదిలీ ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

గోరంట్ల : పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన హెచ్ఎం ఎస్.గోపాల్‌తో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను గురువారం హెచ్ఎం బి.ఈశ్వర్‌ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. స్థానిక బాలుర హైస్కూల్‌లో విధులు నిర్వహించిన హెచ్ఎం ఎస్.గోపాల్ బదిలీపై కొత్తచెరువు జడ్పీ బాలుర హైస్కూల్‌కి వెళ్లారు. అలాగే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో హెచ్ఎం బి.ఈశ్వర్‌ప్రసాద్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

మడకశిర రూరల్ : మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో గురువారం రైతు నాగరాజుకు చెందిన ఆవు ఒకే కాన్పులో రెండు దూడలకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ప్రజలు ఈ అరుదైన దృశ్యాన్ని వీక్షిం చేందుకు తరలివచ్చారు. ఈ సంఘటనపై పశు వైద్య అధికారులు మాట్లాడుతూ మల్టిపుల్ ఓబు లేషన్ జరగడం వల్ల ఇలా కవలలు జన్మిస్తాయన్నారు.ఆవుల్లో ఇలా అరుదుగా జరుగుతుందన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ మారుతిశంకర్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింక్ కేసులు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడం కానీ మద్యం తాగి వాహనం నడపడం నేరం అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రమాదాల నియంత్రణలో భాగంగా కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు.

పేకాట జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని మోదా శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రంగడు యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడులు చేశారు. నలుగురు జూదరులను అరెస్టు చేయడంతో పాటు రూ.75వేల నగదు, 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం 30 మంది పేకాట ఆడుతుండగా బోయ రవీంద్ర, అశ్వత్థప్ప, రాజేష్, నరసింహామూర్తి పట్టుబడ్డారని, మిగిలిన వారు పరారయ్యారని తెలిపారు. అరెస్టు చేసిన వారిని సొంత పూచీకత్తుతో విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరు వ్యాపారుల గుర్తింపునకు సర్వే

అర్హులకే రుణాలు, గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వీధి వ్యాపారులు, చిరు వర్తకుల కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేయడానికి సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహిస్తున్నారు. కదిరి మున్సి పాలిటీలో సంబంధిత అధికారులు వారి సిబ్బందితో సర్వే చేయిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసి నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ కూడా సమీక్ష నిర్వహించి వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశిం చారు. వైసిపి పాలనలో అనర్హులకు పెద్దపీట వేసి రుణాలు మంజూరు చేయించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో సర్వేలు పక్కాగా చేసి అర్హుకు మాత్రమే రుణాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చిరు వ్యాపారులకు రుణాల తో పాటు గుర్తింపు కార్డులు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. సుమారు 2,300 మంది చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయించి నట్లు తెలిపారు. మిగిలిన కుటుంబాలను కింది స్థాయి సిబ్బందితో సర్వేలు చేసి పూర్తి సమాచారాన్ని పై అధికారులకు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం మిగిలిన వారికి రుణాలు మంజూరు చేయడానికి పై అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్స్ పర్సన్ల మద్దతు దారులకే కార్డులతో సహా రుణాలు ఇచ్చినట్లు తెలు స్తోంది. వైసిపి హయాంలో ఆయా ప్రాంతాల్లోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఆ పార్టీ నాయకులు ప్రతి పాదించిన వారికే రుణాలు మంజూరు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. టైలర్లు, దుకాణాదారులు, ఎలాంటి వ్యాపారం చేయని వారు కూడా గత పాల నలో రుణాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో అర్హులకు అన్యాయం జరిగిందన్న విమర్శలు వచ్చాయి.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే మండలంలోని తుమ్మలకుంట్లపల్లి, తాటిమేకలపల్లి, పెద్దసానివారిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మొత్తం పెంచామని, పింఛనుదారుడు మరణిస్తే స్పౌజ్ కింద మరుసటి నెలలో వితంతు పింఛను అందజేస్తున్నామన్నారు. ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, తల్లికి వందనం, పల్లె పండుగ కింద సీసీ రోడ్లు వేశామని, అలాగే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు ఓబుల్‌రెడ్డి, కాలే నాయక్, శివారెడ్డి, డాక్టర్ జాకీర్‌అహ్మద్, మాబాషా, ఇర్షాద్, అంజనప్ప, ప్రసాద్, ఆరిఫ్‌ఖాన్, నిజాం, షాను, కిష్టప్ప, అధికారులు ఉన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రోటరీ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నిక ఇన్సులేషన్ జిల్లా గవర్నర్ కేశవరెడ్డి, సహాయ గవర్నర్ సుమంత్ నంబూరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులుగా కళ్యాణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ గౌడ్, కోశాధికారిగా విజయ్ కుమార్‌ను ప్రకటించారు. అదేవిధంగా ఇన్నర్ వీల్ నూతన కమిటీ జిల్లా ఎడిటర్‌గా స్వాతి రెడ్డి, అధ్యక్షురాలుగా శ్రీలక్ష్మి, కార్యదర్శిగా స్వాతి విజయను ప్రకటించారు. అనంతరం రెండు కమిటీల నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూర రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సీనియర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో వికలాంగ ఉద్యోగులకు అన్యాయం

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ, వార్డు సచివాలయ బదిలీలలో వికలాంగ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ, వికలాంగ ఉద్యోగులకు బదిలీలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జీవో నెంబర్ 5 ,జీవో నెంబర్ 6లను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడం జరిగిందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వం ఆదేశాలు పాటించలేదన్నారు. బదిలీల ప్రక్రియలో వికలాంగఉద్యోగులకు మొదట కౌన్సిలింగ్ జరిగిన తర్వాత మిగిలిన అభ్యర్థులకు ర్యాంకు మేరకు స్థానాలను కేటాయించాల్సి ఉంటుందని, అయితే అవి ఏమీ పట్టనట్టుగా ఉన్నత అధికారులు రాజకీయ పైరవీల తో వికలాంగ ఉద్యోగులను ఇష్టం వచ్చినట్లు బదిలీ చేశారని ఆరోపించారు. దీని మీద తక్షణమే స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లి వికలాంగఉద్యోగులకు అన్యాయం జరగకుండా సంఘం తరపున పోరాటం చేస్తామని రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ తెలిపారు.

బెల్ట్ షాపులు మూయించాలని వినతి

ప్రజాశక్తి-ఓబుళదేవర చెరువు

మండల వ్యాప్తంగా వెంటనే మద్యం బెల్ట్ షాపులను మూయించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సిపి) నియోజకవర్గ కార్యదర్శి మున్నా, ఏపీ రైతు సంఘం నాయకులు ఆకుతోట రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు తహశీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో మద్యం బెల్ట్ షాపులు పుట్టగొడు గుల్లా వెలిశాయన్నారు. ఓడి చెరువు మండల కేంద్రంలోనే దాదాపు 10 బెల్ట్ షాపులు ఉండగా, మం డల వ్యాప్తంగా 104 పల్లెలు ఉండగా ప్రతి పల్లెలో 3, 4 షాపులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఇవన్నీ తెలిసినా పోలీసు అధికారులు కానీ, ఎక్సైజ్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్రామాల్లో యువత మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నార న్నారు. వెంటనే బెల్ట్ షాపులను మూయించాలని, విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న మద్యం షాపులను మార్చాలని కోరారు. లేనిచో ఆర్‌సిపి ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా గురువారం హార్ట్ టు హెల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాండ్లపెంట మండ లంలోని తుమ్మలబైలు పెద్దతండా, గరుగుతండాల్లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రస్ట్ సభ్యులు తండాలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిం చారు. అలాగే సుమారు 200 కుటుంబాలకు ప్లాస్టిక్ రహిత నాన్ వోవెన్ ఫాబ్రిక్ బ్యాగులులి పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవినాయక్ తెలి పారు. గ్రామీణ ప్రాంతంలో పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు వాడకం వల్ల పర్యావరణం కలుషితం కావడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల మూగజీవాలు మరణిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్‌ను నిరోధించి పర్యావరణ హిత బ్యాగులు వాడాలని వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయక్, గ్రామపెద్దలు భూక్యా లోకేష్‌నాయక్, జగదీష్‌నాయక్, సురేందర్‌నాయక్, సోమ్లానాయక్, శ్రీరాములునాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కెకె పాలెం, తిమ్మలాపురం, దేవరహట్టి, సీసీగిరి గ్రామాల్లో గురువారం టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, మంజునాథ్, ప్రకాష్, మార్కెట్ డైరెక్టర్ జయన్న, కో కన్వీనర్ ఈరన్న, డీలర్ వెంకటేష్, కృష్ణప్ప, ప్రకాష్, టి.జయన్న, తిప్పేస్వామి, చిత్రశేఖర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రిలే దీక్షల్లో భాగంగా 8వ రోజైన గురువారం కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు వినూత్నంగా అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయకృష్ణ, బాబు, అనిల్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ఏకరువు పెట్టారు. ఏడాదిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సమస్యలు పరిష్కరించడం లేదని మండిపడ్డారు. కార్మికుల న్యాయ పోరాటాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ప్రయత్నించడం దారుణమన్నారు. కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ జరపకుండా ప్రభుత్వం కాలయాపన చేయడంపై విరుచుకుపడ్డారు. దీక్షలో కాటమయ్య, చింతా కేశవ, దస్తగిరి, చంద్రశేఖర్ రెడ్డి, యోగేష్, కార్మికులు పాల్గొన్నారు.

అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు